ఆగిన బ్రిడ్జి నిర్మాణం..
నిర్లక్ష్యం వహిస్తే పెను ప్రమాదం

- ఎన్నికల అనంతరం ముందుకు కదలని రెడ్డివారిపల్లె బ్రిడ్జి పనులు
- బ్రిడ్జి నిర్మాణం కోసం గుంజనేరుకు అడ్డంగా మట్టికట్ట ఏర్పాటు
- ఏరు పారితే జనావాసాల్లోకి వరదనీరు
- అధికారులు చర్యలు చేపట్టాలంటూ ముంపు గ్రామాల వాసుల వినతి


రెడ్డివారిపల్లి బ్రిడ్జి వద్ద గతంలో వచ్చిన గుంజనేరు వరద ప్రవాహం (ఫైల్)


రెడ్డివారిపల్లి బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా మట్టికట్టను నిర్మించిన దృశ్యం

రైల్వేకోడూరు అర్బన్ : శేషాచలం అడవుల నుంచి ప్రవహిస్తూ వాగులు, వంకలు దాటుకొని ప్రతి ఏటా ఉధృతంగా గుంజన ఏరు ప్రవాహం వలన రెడ్డివారిపల్లి, నరసరాంపురం, కృష్ణానగర్, ధర్మాపురం, గాండ్లవీధి ప్రాంతాలు మునుగుతుండేది. దీని వలన వేలాది మంది ప్రజల అసౌకర్యాన్ని గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు కృషి చేసి రూ. 16 కోట్లతో నిర్మాణం మొదలుపెట్టారు. ఎన్నికలు వచ్చి కొత్త ప్రభుత్వం కొలువుదీరాక రెడ్డివారిపల్లి బ్రిడ్జి నిర్మాణం నిర్లక్ష్యానికి గురై పనులు ఆగిపోయాయి. సంబంధిత కాంట్రాక్టర్ పట్టించుకోలేదు. బ్రిడ్జి పనులు ప్రారంభించి నేటికి పది నెలలు అయినా పనులు ముందుకు సాగలేదు. ఎన్నికలకు ముందు పనులు వేగవంతంగా జరిగి పిల్లర్లు పూర్తయి ఒక స్లాబు కూడా వేసారు. కొత్త ప్రభుత్వం వచ్చిన అరవై రోజులు అయినప్పటికీ ఇంత వరకు పనులు ఊసే ఎత్తలేదు. దీంతో బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా స్లాబులు వేయడానికి ఆనకట్ట నిర్మించారు. దీనివల్ల వలన రాబోయే వర్షాకాలంలో గుంజనేరు ప్రవహిస్తే నరసరాంపేట, కృష్ణానగర్, పొట్టి శ్రీరాముల వీధి, గాండ్లవీధి, ధర్మాపురం వంటి ప్రాంతాలు మునిగే ప్రమాదం ఉంది. మోస్తారు వర్షాలు పడితే శేషాచలం అడవులలో నీరు వరద అధికంగా పొంగి పొర్లుతుంది. దీనివల్ల ఈ ప్రాంతాలలో నీరు వచ్చే అవకాశం ఉంది. స్లాబులు త్వరితగతి నిర్మించడమో, లేక నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన కట్టను తొలగించడమో చేయాలి. లేకపోతే నరసరాంపేట, కృష్ణానగర్, ధర్మాపురం, గాండ్లవీధి ప్రాంతాలకు ముప్పు ఏర్పడే ప్రమాదముంది. 2020- 21, 23 సంవత్సరాలలో వరద ప్రవాహాన్ని గుర్తు చేసుకొని ఇక్కడి గ్రామస్తులు భయబ్రాంతులవుతున్నారు. ప్రభుత్వం, అధికారులు ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఆర్అండ్‌బీ ఏఈని ఏమంటున్నారంటే..

ఈ విషయంపై ఆర్అండ్‌బీ ఏఈ నరేంద్రరెడ్డిని వివరణ అడుగగా ఇప్పటికే కాంట్రాక్టర్‌కు తెలియజేశామని వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని పనులు త్వరితగతిన పూర్తి చేసి మట్టికట్టను తొలగించాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు చెప్పారు. అలా కాని పక్షంలో ముందస్తుగా మట్టిని తొలగించి ప్రవాహానికి అంతరాయం లేకుండా చూస్తామన్నారు.

గాండ్లవీధికి ప్రమాదం



ఈ ఏడాది వర్షాలు అడపదడప పడుతున్నాయి. రెడ్డివారిపల్లె బ్రిడ్జికి దగ్గరగా గుంజనేరు పక్కనే గాండ్లవీధి ఉంది. కొద్దిపాటి వరద నీరు ఆగినా మొదట గాండ్ల వీధి, నారాయణస్కూల్, ఉంగరాల నగర్‌లకు ప్రమాదం, అధికారులు తక్షణం స్పందించాలి. ప్రభుత్వం, అధికారులు మా ఆవేదనను అర్థం చేసుకుని కాలనీలోకి ఏరు పారిన నీరు రాకుండా శాశ్వత పరిష్కారం చూపాలి.

– ధన, గాండ్లవీధి, రైల్వేకోడూరు

ముంపునకు గురవుతుంది



ఆంజనేయస్వామి గుడి వీధిలో మేము నివాసముంటున్నాం. భారీ వర్షాలు పడితే గుంజనేరు ప్రమాదకరంగా ప్రవహిస్తుంది. గతంలో వచ్చిన వరదలకు ఇళ్లను వదిలి వెళ్లాం. గత పరిణామాలు గుర్తుకు అధికారులు చర్యలు చేపట్టాలి. మట్టికట్టను తొలగించడమో శరవేగంగా పనులు పూర్తి చేయాలి.

– గంగాధర్, ఆంజేయస్వామి గుడి వీధి, కోడూరు

ఇళ్లు కూలిపోయాయి



2021 లో వచ్చిన వరదలకు నరసరాంపేటలోని గుంజనేరు కోతకు గురై కాలనీలోకి వచ్చాయి. కాలనీలో నివాసాలు దెబ్బతిన్నాయి. నేను ఉంటున్న ఇండ్లు కూలి పోయింది. దీంతో రెండు వీధులలో వరద ప్రవహించింది. అప్పటి మా పరిస్థితి తలుచుకుంటేనే ఆవేదన కలుగుతుంది. మట్టికట్టను అలానే ఉంచితే వేలాది మంది ప్రజలు ఇబ్బందులకు గురికాక తప్పదు. ప్రభుత్వం పనులు సాగేలా చూడాలి.

– సీహెచ్ చంద్రశేఖర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు, నరసరాంపేట, రైల్వేకోడూరు

కట్ట తొలగించాలి



గత ప్రభుత్వం కోడూరుకు ఇతర గ్రామాలతో వరద ఉన్న రోజుల్లోనూ సంబంధాలను పెంచాలని బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. రెడ్డివారిపల్లి హైలెవల్ బ్రిడ్జి త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలి. లేకుంటే వరద వస్తే ప్రమాదం పొంచి వుంటుంది. వర్షాకాలంలోపు నిర్మించలేని పక్షంలో అధికారులు స్పందించి మట్టికట్టను తొలగించాలి.

– బుడుగు శివయ్య, సర్పంచ్, రైల్వేకోడూరు

క్లుప్తంగా

నేటి నుంచి సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ

సిద్దవటం : మండల కేంద్రమైన సిద్దవటం ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో సోమవారం నుంచి రెండు రోజులపాటు సర్పంచ్‌లకు, గ్రామ కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తునట్లు ఈఓపీఆర్‌డీ పులిరామ్‌సింగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా శిక్షణా కార్యక్రమంలో పారిశుధ్యం, వ్యర్థ పదార్థాలు, గ్రామల్లో వీధి దీపాలు, విద్యుత్ బిల్లుల నిర్వహణ తదితర అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రతి రోజు ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ నిర్వహిస్తామని, సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు తప్పకుండా హాజరుకావాలని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు.

రామాపురంలో..

రామాపురం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు మండలంలోని 13 గ్రామ పంచాయతీల పరిధిలోని సర్పంచ్‌లకు, గ్రామ కార్యదర్శులకు సోమవారం నుంచి మూడు రోజులపాటు శిక్షణ కార్యక్రమాలను ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ మండల అభివృద్ధి అధికారి ఉషారాణి తెలిపారు. ఈ శిక్షణకు మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తప్పక హాజరుకావాలని చెప్పారు.

జీఓ నెం.29 ప్రకారం సర్దుబాటు ప్రక్రియ చేపట్టాలి

సంబేపల్లె : జీఓ నెంబర్ 29 ప్రకారం సర్దుబాటు ప్రక్రియ చేపట్టాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ సంఘ నాయకుడు రామాంజులు ఆదివారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఓ నెంబర్ 117, 53ల ప్రకారం విద్యావ్యవస్థ నిర్వీర్యమైందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అదే జీఓను ప్రకారం సర్దుబాటు పక్రియ చేపట్టినట్లయితే విద్యావ్యవస్థ ఇంకా దిగజారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన జీఓ నెంబర్ 29 ప్రకారం సర్దుబాటు పక్రియ చేపట్టాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

నూతన కమిటీ ఎన్నిక

రాజంపేట టౌన్ : ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ రాజంపేటశాఖ అధ్యక్షుడిగా ఎస్ఎండీ కరీంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఎస్‌జీ.ఇనాయతుల్లా, ఉపాధ్యక్షులుగా ఆర్‌కెఎస్.ఆదిల్, పి.ఆరీఫ్, ప్రధాన కార్యదర్శిగా సైజాన్, సహాయ కార్యదర్శిగా మసూద్, షేక్ మతిన్, కోశాధికారిగా షేక్ నిసార్, కార్యవర్గ సభ్యులుగా షేక్ షాహిద్, సయ్యద్ సలీంలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు కరీం మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల హక్కుల సాధనకు కమిటీ ప్రతినిధుల సహకారంతో శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. అలాగే ముస్లిం మైనార్టీల సమస్యల పరిష్కరిస్తానని తెలిపారు.

మండల తహసీల్దార్‌గా రామాంజనేయులు

రామాపురం : మండల తహసీల్దార్‌గా రామాంజనేయులు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల ముందు మండలంలో పనిచేస్తున్న శ్రీనివాసులు అనంతపురం జిల్లాలో ఆయన స్థానానికి వెళ్లడంతో రామాపురానికి రాయచోటి తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న రామాంజనేయులును మండల తహసీల్దార్‌గా బదిలీపై వచ్చారు. మాట్లాడుతూ ప్రజా సమస్యలు తమ దృష్టికి వచ్చిన వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపడుతామన్నారు.

ఎస్సీ వర్గీకరణ రద్దు చేయాలి


కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

నందలూరు : ఎస్సీ వర్గీకరణ వెంటనే రద్దు చేయాలని నందలూరు బస్టాండ్ కూడలిలోని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఎదుట కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం సాయంత్రం మాల మహానాడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ వెంటనే నిలుపుదల చేయాలని మాలలు పెద్దఎత్తున నినాదాలు చేశారు. అనంతరం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు అనుదీప్, పెనగలూరు నాగసుబ్బయ్య, సర్పంచ్‌లు సూర్యనారాయణ, మోదపోతుల రాము, పనతల గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లి ఎస్ఐగా జి.రవీంద్ర బాబు



లక్కిరెడ్డిపల్లి : లక్కిరెడ్డిపల్లి ఎస్ఐగా జి.రవీంద్రబాబు శనివారం రాత్రి 11 గంటల సమయంలో స్టేషన్‌కు చేరుకుని బాధ్యతలు చేపట్టినట్లు ఆదివారం పోలీసులు తెలియజేశారు. రవీంద్రబాబు పెద్దతిప్పసముద్రం నుంచి బదిలీపై లక్కిరెడ్డిపల్లికి వచ్చినట్లు వారు తెలిపారు. ఇక్కడ పనిచేస్తున్న విష్ణువర్ధన్ అన్నమయ్య జిల్లా రాయచోటి వీఆర్‌కు బదిలీపై వెళ్లారు.

బాధ్యతలు స్వీకరించిన సబ్ ఇన్‌స్పెక్టర్లు


మోహన్‌కుమార్‌గౌడ్, ఎస్ఐ, పుల్లంపేట


నరసింహారెడ్డి, ఎస్ఐ, రాయచోటి అర్బన్


మహేష్ నాయుడు, ఎస్ఐ, ఓబులవారిపల్లె


పి.రామకృష్ణ, ఎస్ఐ, గాలివీడు


గాలివీడు : మండల ఎస్ఐగా పి.రామకృష్ణ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ వెంకటప్రసాద్ బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో సంబేపల్లెలో పనిచేస్తున్న పి.రామకృష్ణను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. పేకాట, కోడిపందేలు, మట్కా, క్రికెట్ బెట్టింగ్‌లు వంటి అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు.

ఓబులవారిపల్లె : మండల ఎస్ఐగా ఆదివారం మహేష్ నాయుడు బాధ్యతలు చేపట్టారు. ఆయన అన్నమయ్య జిల్లా కేంద్రంలోని దిశా పోలీస్ స్టేషన్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎస్ఐ చిన్న పెద్దయ్య బదిలీపై చాపాడుకు వెళ్లారు. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే సహించబోమని హెచ్చరించారు. అలాగే శాంతిభద్రతలు కాపాడేందుకు ప్రజలు సహకరించాలని వారు కోరారు.

రాయచోటి టౌన్ : రాయచోటి అర్బన్ సర్కిల్ పోలీస్ స్టేషన్‌లో అర్బన్ ఎస్ఐగా నరసింహారెడ్డి ఆదివారం బాధ్యతలు చేపట్టారు. శనివారం నిర్వహించిన సాధారణ బదిలీలలో భాగంగా ఆయనను రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐగా వచ్చారు. ఆయన గతంలో సుండుపల్లె పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించడంతోపాటు గత ఎన్నికల ముందు, ఎన్నికల తరువాత ఇదే అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వర్తించారు. గత రెండు నెలల క్రితం బదిలీపై ఎస్పీ కార్యాలయానికి వెళ్లిన ఆయన తిరిగి రాయచోటి అర్బన్ (అదే) పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. దీంతో ఆయనను అధికారులు అభినందించారు. ప్రజలకు ఎల్లవేళ్లలా అందుబాటులో ఉంటూ అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చర్యలు చేపడతానన్నారు.

పుల్లంపేట : పుల్లంపేట ఎస్ఐగా మోహన్ కుమార్ గౌడ్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో పనిచేసిన ఎస్ఐ రఘురాం వీఆర్‌కు బదిలీ అయ్యారు. సాధారణ బదిలీలో భాగంగా రాజంపేటలో విధులు నిర్వహిస్తూ బదిలీ నిమిత్తం మోహన్‌కుమార్ పుల్లంపేటకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతామని, అలాగే అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు.

ఏపీఎండీసీ ఎగుమతులు పునరుద్ధరించాలి


మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

రాజంపేట రూరల్ : ఏపీఎండీసీ మైనింగ్ ఎగుమతులను పునరుద్ధరించి కార్మికులకు అండగా నిలవాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం విలేకరులతో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. మంగంపేట మైనింగ్‌ను నమ్ముకొని ఎంతో మంది కార్మికులు జీవిస్తున్నారని తెలియజేశారు. మైనింగ్ ఎగుమతులను నిలిపివేసి వారి పొట్టకొట్టవద్దని కోరారు. దాదాపు 800 టిప్పర్లలో పని చేసే డ్రైవర్లు, క్లీనర్‌లు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. వెల్డింగ్ కార్మికులు, చిన్న కిరాణా కొట్టుల నిర్వాహకులు ఉపాధి లేక ఇక్కట్లు పడుతున్నారని తెలియజేశారు. పెట్రోలు బంకులు వెలవెలపోతున్నాయని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం ఎగుమతుల విషయంలో పునరాలోచించాలని విన్నవించారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం మైనింగ్ ఎగుమతులకు అనుమతులు జారీ చేయాలని డిమాండ్ చేశారు.

కృష్ణ చైతన్య ట్రస్ట్ సేవలు అభినందనీయం


ఆర్ఓ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న సీఐ మద్దెయ్య ఆచారి

రాజంపేట రూరల్ : కృష్ణ చైతన్య అన్నదాన ట్రస్ట్ నిర్వహించే సేవలు అభినందనీయమని అర్బన్ సీఐ మద్దెయ్య ఆచారి కొనియాడారు. భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లే బలిజపల్లి గంగమ్మతల్లి వద్దకు వచ్చే భక్తుల కోసం రూ.60వేల రూపాయలతో ఆర్ఓ ప్లాంట్‌ను కృష్ణ చైతన్య అన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ ఆర్ఓ ప్లాంట్‌ను ఆదివారం అర్బన్ సీఐ మద్దెయ్య ప్రారంభించారు. తదనంతరం ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో వివిధ దేవాలయముల వద్ద భక్తుల దాహార్తిని తీర్చడం కోసం 12 ఆర్ఓ ప్లాంట్లను ఏర్పాటు చేయటం గొప్ప విషయమన్నారు. ట్రస్ట్ అధ్యక్షులు ఐ.వజ్రశేఖరరెడ్డి మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో మరిన్ని సేవ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ కోశాధికారి వై.నాగేశ్వరనాయుడు, ప్రతినిధులు ఎస్.క్రిష్ణయ్య, ఐ.రామ్మోహన్‌రెడ్డి, ఎం.నరసింహారెడ్డి, ఎస్.రవీంద్రారెడ్డి, ఐ.నరసింహారెడ్డి, కె.దాముఆచారి, బోనం రమణ, కేఎంఆర్ రెడ్డెయ్య, గుగ్గిళ్ల రెడ్డిప్రసాద్, ఎస్.రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

హిందువులపై దాడులను ఆపండి

రామాపురం : బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ఆపాలని విశ్వహిందు పరిషత్ భజరంగ్‌దల్ తీవ్రంగా ఖండిస్తూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బీజేపీ ప్రభుత్వం చూడాలని రామాపురం వీహెచ్‌పీ నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని హరిహర ఆలయంలో మాట్లాడుతూ ప్రధాన మంత్రి మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాలు హిందువులను కాపాడేలా చర్యలు చేపట్టాలని భజరంగదల్ అన్నమయ్య జిల్లా సంయోజక్ వీరారెడ్డి కోరారు. బంగ్లాదేశ్‌లో ఎంతో మంది హిందువులు ఉన్నారని, దాడుల నుండి రక్షించి స్వదేశానికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ లక్కిరెడ్డిపల్లె ప్రఖండ అధ్యక్షులు ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యక్షులు దామోదర్ నాయుడు, మండల అర్చక పురోహిత ప్రముఖ్ నాగరాజ, వీహెచ్‌పీ సభ్యులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయాల్లో పూజలు


సంబేపల్లె: నల్లగంగమ్మను దర్శించుకుంటున్న భక్తులు

సంబేపల్లె : దేవరరాయి నల్లగంగమ్మ ఆలయంలో ఆదివారం శ్రావణమాస పూజలను పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొన్నారు.

సిద్దవటం : మండలంలోని మూలపల్లె క్రాస్ వద్ద వెలసిన ఇరుగులమ్మకు ఆదివారం పూజలు నిర్వహించామని పూజారి వెంకటరమణ తెలిపారు. భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. భక్తులకు మూలపల్లెకు చెందిన కె. విశ్వనాథ్ దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

చిన్నమండెం : మాండవ్యానది ఒడ్డున వెలసియున్న మల్లూరమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం కావడంతో అమ్మవారికి ప్రత్యేక పూజలు గావించారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని బోనాలు సమర్పించారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట


ఇసుక అక్రమ రవాణాకు అరికట్టేందుకు నదిలోకి ట్రాక్టర్‌లు వెళ్లకుండా జేసీబీతో పని చేస్తున్న సీఐ

ఒంటిమిట్ట : మండల పరిధిలో ఇసుక అక్రమ రవాణాకు పోలీసులు చర్యలు తీసుకున్నారు. ఆదివారం ఒంటిమిట్ట సీఐ మోహన్ కుమార్, ఎస్ఐ మధుసూదన్ రావుల ఆధ్వర్యంలో నదీ తీరంలోకి వెళ్లే మార్గంలో వాహనాలు వెళ్లకుండా గాడి కొట్టించారు. ఇసుక అక్రమ రవాణా పాల్పడితే కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాలు గురుస్వామికి సత్కారం

నందలూరు : తమిళనాడులోని కంచిపురంలో అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న శరణవీధి కార్యక్రమంలో నందలురు వాసి అయ్యప్ప గురుస్వామి ఏబీఏపీ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఏనుగుల బాలాంజనేయులు (బాలు) గురుస్వామిని ఘనంగా సత్కరించారు. ఆదివారం కంచిపురంలోని మోహన్ మహల్ వేదికగా జరిగిన ఈ కార్యక్రమంలో శబరిమాల మాజీ మేల్ శాంతులు బ్రహ్మశ్రీ శశి నంబూద్రి, బ్రహ్మశ్రీ దామోదరన్ పొట్టీలు గణపతిహోమం, లక్ష్మీహోమం, చండీహోమం, నవగ్రహ పూజ, అయ్యప్ప పూజలను నిర్వహించారు. అనంతరం తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలోని 18 మంది గురుస్వాములకు అయ్యప్ప సేవారత్న అవార్డును అందజేశారు.

పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఆకేపాటి


కేశఖండన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి

సుండుపల్లె : మండల పరిధిలోని మడితాటమ్మ దేవాలయం వద్ద పింఛా గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు సురేంద్రారెడ్డి మనవడి కేశఖండన కార్యక్రమంలో రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథరెడ్డి పాల్గొన్నారు. తదనంతరం రాయవరం కావలిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త రమణయ్య మృతదేహానికి ఆయన పూలమాల వేసి నివాళి అర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడుతూ ప్రజలకు ఏ సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకువస్తే తక్షణమే సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం గ్రామ ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ రామస్వామిరెడ్డి, మధురెడ్డి, రెహమాన్ ఖాన్, సర్పంచ్ రామ జయచంద్ర, భద్రి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును వెనక్కి తీసుకోండి


మాట్లాడుతున్న షేక్ సిరాజుద్దీన్

రాజంపేట టౌన్ : వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం వెంటనే వెనక్కు తీసుకోవాలని రాజంపేట ముస్లిం మైనార్టీల మతపెద్ద షేక్ సిరాజుద్దీన్ డిమాండ్ చేశారు. స్థానిక ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం అసోసియేషన్ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వక్ఫ్ బోర్డు చట్టంలో 114 సెక్షన్లు ఉన్నాయని వాటిలో 40 సెక్షన్లను ప్రభుత్వం సవరణ చేయాలని పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టారన్నారు. ముస్లింలకు సంబంధించి వక్ఫ్ బోర్డు ఆస్తులు ఎక్కువగా ఉన్నాయన్నారు. వక్ఫ్ బోర్డు ఆస్తులు అన్యాక్రాంతం అవుతున్నాయన్నారు. తమ ఆస్తులను రక్షించేందుకు ఎండోమెంట్ తరహాలో అధికారాలు ఇవ్వాల్సిందిపోయి బోర్డుకు ఉన్న అధికారాలను కుదించే విధంగా బిల్లు ప్రవేశపెట్టడం సరైనది కాదన్నారు. వక్ఫ్ బోర్డు చట్టాన్ని నిర్వీర్యం చేయడమే కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ముస్లింలకు నష్టం వచ్చే ఏ బిల్లునూ అమలు చేయమని చెప్పిన చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్‌లు వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును అడ్డుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు ఎస్.ముజఫర్ అహమ్మద్, ఎస్‌జీ.ఇనాయతుల్లా, ఎస్ఎండీ కరీం, పి.మోసిన్‌ఖాన్, షేక్ సైజన్, ఆర్‌కేఎస్ ఆదిల్, ఆరీఫ్‌ఖాన్, సయ్యద్ మసూద్, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

మరింత మెరుగైన సేవలు అందించండి


ప్రమాణ స్వీకార మహోత్సవంలో మాట్లాడుతున్న సంస్థ చైర్మన్ రామచంద్రారెడ్డి

లక్కిరెడ్డిపల్లి : మానవత స్వచ్ఛంద సేవాసంస్థ సేవలు అభినందనీయమని, నూతనంగా ఎన్నికైన కార్యవర్గ కమిటీ సభ్యులు పేద ప్రజలకు సంస్థ ఆధ్వర్యంలో మరింత మెరుగైన సేవలు అందించాలని మానవత వ్యవస్థాపకులు ఎస్.రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని నలందా హైస్కూల్‌లో జరిగిన మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకార మహోత్సవంలో మంత్రి సోదరుడు డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ రెడ్డి, ముఖ్య అతిథిగా మానవత వ్యవస్థాపకులు ఎస్.రామచంద్రారెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవత స్వచ్ఛంద సేవాసంస్థ సేవలు అభినందనీయమన్నారు. అనంతరం లక్ష్మీ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ మానవత స్వచ్ఛంద సంస్థ సభ్యులు వారి విలువైన సమయాన్ని వెచ్చించి కరోనా కష్టకాలంలో పేద ప్రజలకు అండగా నిలిచారన్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అధ్యక్షులు రమణారావు, చైర్మన్ ఏఎస్ బాల సుబ్రమణ్యం ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం అధ్యక్షులుగా డాక్టర్ ఎస్ఎండీ షఫీ నాయక్, ఉపాధ్యక్షులుగా కె.మలిరెడ్డి, కార్యదర్శిగా ఎ.రామచంద్ర, కోశాధికారిగా పి.రవిశంకర్, జాయింట్ సెక్రటరీగా వై.గంగిరెడ్డి, ఎగ్జిక్యూటీవ్ కమిటీ సభ్యులు గోవిందు నాగరాజు, వేల్పుల రవి, ఎం.రమణ, బి.శ్రీనివాస్‌లు సభ్యులుగా ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం నిరుపేద ఇంటర్ విద్యార్థినీ సీఎస్ నాగ భవితకు పుస్తకాల కోసం రూ. 4 వేలు విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ కమిటీ డైరెక్టర్లు రాటాల గోపి, ఎస్.సహదేవరెడ్డి, వై.ప్రసాద్ యాదవ్, జిల్లా అధ్యక్షులు సుబ్బారెడ్డి, జిల్లా కార్యదర్శి కృష్ణారావు, రాయచోటి చైర్మన్ శివగంగిరెడ్డి, చెన్న కృష్ణారెడ్డి, సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి అనూహ్య స్పందన


రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సుండుపల్లె : మండల కేంద్రంలోని ఆరెమ్మ తల్లి దేవాలయ సన్నిధిలో శ్రీ వెంకటేశ్వర అరవింద్ కంటి ఆసుపత్రి మధురై శాఖవారి సౌజన్యంతో మెగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని యర్రపురెడ్డి ఆరంరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి పాల్గొని రిబ్బన్ కట్ చేసి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. మండలంలోని 250 మందికి డాక్టర్లు పరీక్షలు చేయగా అందులో 60 మందికి కంటి ఆపరేషన్ అవసరమని గుర్తించి హాస్పిటల్‌లో ఉచితంగా కంటి ఆపరేషన్‌కు రెఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ రామస్వామి రెడ్డి, అంజమ్మ, మధుసూదన్ రెడ్డి, రెహమాన్ ఖాన్, రహీం బాషా, సర్పంచ్ రమాజయచంద్ర, వైద్యులు వనిత, హిమజ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట

సుండుపల్లె : సొంతంవారిపల్లి గ్రామంలో మారెమ్మ విగ్రహ ప్రతిష్టను ఆదివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రాణ ప్రతిష్టను చేశారు. పాల్గొన్న భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

అంజన్నకు శ్రావణమాస పూజలు

పుల్లంపేట : కోటగడ్డపై వెలసిన అభయాంజనేయస్వామికి ఆదివారం రెడ్డిపల్లి ప్రజలు 101 టెంకాయలు కొట్టి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.